ఘనంగా అచ్చివెళ్లి గంగమ్మ వార్షికోత్సవం

వేముల : మండలంలోని గొల్లలగూడూరు గ్రామంలో మంగళవారం శ్రీఅచ్చివెళ్లి గంగమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు, మహిళలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉషాకిరణ్ విద్యార్థులకు ప్రతిభా అవార్డు ప్రదానం



ప్రతిభా అవార్డులు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే, కరస్పాండెంట్

వేంపల్లె : పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డ్స్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా సోమ వారం కడప పట్టణంలోని మాధవి కన్వెన్షన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో పట్టభద్రుల శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పూనేటి తేజేష్, పడమటింటి కేశవానంద్‌లకు రూ.20వేల చెక్కును, ప్రశంసా పత్రం, మెడల్‌ను ప్రదానం చేశారు.

ప్రారంభమైన భీమేశ్వరస్వామి తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామసమీపంలో వెలసిన శ్రీభీమేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బుధవారం ఉదయం 9.55గంటల నుంచి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ అవరణలో ఎద్దులచే బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు మొదటి బహుమతి రూ.1లక్ష, రెండవది రూ. 80వేలు, మూడవది రూ.60వేలు, నాల్గవది రూ.40వేలు, ఐదవది రూ.20వేలు అందజేస్తామన్నారు.

ఆవిర్భావ సదస్సులను విజయవంతం చేయాలి

కమలాపురం : ప్రతి మాదిగ బస్తీలలో నిర్వహించే ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ సదస్సులను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండాల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కమలాపురంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు మాదిగ అధ్యక్షతన ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రాలతో పాటు నియోజకవర్గ కేంద్రాలలో ముఖ్యంగా మాదిగపల్లెలలో ప్రతి మాదిగ బస్తీలో జూలై 27న నిర్వహించబోయే ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ సదస్సులను ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు.

పవర్ గ్రిడ్ వద్ద రైతుల నిరసన

చింతకొమ్మదిన్నె : మండలంలోని చింతకొమ్మదిన్నె, కొలుములపల్లె, జమాలపల్లె, ఇప్పపెంట గ్రామాల రైతులు చిన్నకాంపల్లె పవర్ గ్రిడ్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దీనితో పవర్ గ్రిడ్ అధికారులు స్పందించి రైతులతో మాట్లాడారు. పవర్ గ్రిడ్, స్టేరిలైట్ కంపెనీ వాళ్ళు విలువైన భూముల గుండా 765 కేవీ విద్యుత్ లైన్లు వేయడానికి డిజైన్లు తయారు చేస్తున్నారని ఆంధ్రజ్యోతి కడప మెయిన్ ఎడిషన్ ఏప్రిల్ నెల 10వ తేదీన ప్రచురించారన్నారు. దీనిపై అభ్యంతరాల స్వీకరణ కోసం రెండు నెలలు గడువు ఇస్తూ తమ స్టేరిలైట్ ఢిల్లీ కార్యాలయ చిరునామా ఇచ్చారన్నారు. అయితే రైతులు అక్కడికి వెళ్లగా సదరు చిరునామా నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయారని తెలిపారు. తమ అభ్యంతరాలను పోస్ట్ ద్వారా, మెయిల్ ద్వారా పంపించామని, స్టేరిలైట్ మరియు పవర్ గ్రిడ్ అధికారులు విద్యుత్ లైనులను చింతకొమ్మదిన్నె చెరువు నుండి నేరుగా చింతకొమ్మదిన్నె గుట్టలోని పవర్ గ్రిడ్‌కు చేరుకునే విధంగా డిజైన్లు మార్పు చేసుకోవలసిందిగా రైతులు కోరారు. మంగళవారం కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, చింతకొమ్మదిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావు స్పందించి పవర్ గ్రిడ్ అధికారులతో క్షేత్రస్థాయిలో రైతుల పరిష్కారానికి తగిన సూచనలు చేశారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలుపరచాలి

వేంపల్లె : 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని జాతీయస్థాయి స్వచ్ఛంద సంస్థ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌ను కోరారు. మంగళవారం కడపలో ప్రతినిధులతోపాటు జిల్లా అధ్యక్షుడు గూడూరు రామచంద్ర డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25% సీట్లు ఆర్థికంగా సామాజికంగా వెనుక బడిన వర్గాల పిల్లలకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌కుమార్, మిషన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కేంద్ర కమిటీ సభ్యులు అశోక్, కడప జిల్లా అధ్యక్షులు గూడూరు రామచంద్ర, వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

రేణుకా చౌదరి బహిరంగ క్షమాపణ చెప్పాలి

పులివెందుల టౌన్ : రెండు రోజుల క్రితం తెలంగాణ కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరి ఏపీ రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద, ఆయన అమ్మ వైఎస్ విజయమ్మ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిందని, వెంటనే ఆమె క్షమాపణలు చెప్పాలని రెడ్డి కమ్యూనిటీ సొసైటీ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, ఆర్‌సీడీఎస్ ఉపాధ్యక్షుడు సర్వోత్తమరెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం పులివెందులలో వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి మీది కాదు రేణుకా చౌదరి మీ స్థాయిని చూసి మాట్లాడాలన్నారు. నీ గురించి పార్లమెంట్‌లోనే నరేంద్రమోదీ మిమ్మల్ని సూర్పనక్కగా అభివర్ణించారంటే మీస్థాయి ఏమిటో అర్థమవుతోందని, మీరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ విజయమ్మలపై చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఆంధ్రజ్యోతి విషయానికి వస్తే కిరాక్ ఆర్పీ, సీమ రాజా వీళ్ల రోజా గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన తీరు కూడా మీ టీవీ ఛానల్‌లో టెలికాస్ట్ చేస్తారని, వైఎస్సార్‌సీపీలో ఉండే ఆడవారిని అనకూడని మాటలు అన్నారని, దాని గురించి ఏం మాట్లాడరన్నారు.

భూసార పరీక్షలతో లాభాలు

వల్లూరు : రైతులు వ్యవసాయ భూములలో భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలను సాగు చేయడం వలన మంచి ఫలితాలు పొందవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ వీరయ్య అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని దిగువపల్లి, అంబవరం గ్రామాలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూసార పరీక్షల ప్రాముఖ్యత, వాటిని అనుసరించి ఎరువుల యాజమాన్యం చేయడం వలన లాభాలను వివరించారు. కార్యక్రమంలో భారత నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రత్నకుమార్, శాస్త్రవేత్త డాక్టర్ కే సాయిమహేశ్వరి, పశు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమా ర్‌రెడ్డి, పశు వైద్యాధికారి శ్రీహరి, గ్రామీణ వ్యవసాయ అధికారి దొరబాబు, రై తులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నిర్వహించడం చట్టరీత్యా నేరం

వీరపునాయునిపల్లె : తక్కువ వయస్సులో వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు జయలక్ష్మి, లక్ష్మిదేవి తెలిపారు. మంగళవారం గంగిరెడ్డిపల్లె, పాయసంపల్లె సెక్టారులోని ఇందుకూరులో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలని వారికి మంచి చదువులు చదివించాలన్నారు. వారిపై ఎటువంటి వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరీ బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీల అడ్మిషన్‌లకు 50,541 దరఖాస్తులు

వేంపల్లె : 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆర్జీయూకేటీ అడ్మిషన్ అప్లికేషన్ చివరి తేదీ నాటికి మొత్తం 50,541 దరఖాస్తులు అందాయని ఆర్జీయూకేటీ ఏపీ రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్, అడ్మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్ర సంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తుల గడువును మే 2 నుండి మే 10 వరకు పొడిగించారు. ఈ పొడిగింపు కాలంలో 1,340 దరఖాస్తులు అదనంగా అందినట్లు ఆయన వెల్లడించారు. అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడం ద్వారా ఆర్జీయూకేటీపట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

మసీదు మీనార్‌పై పిడుగు


పడిపోయిన మినార్

చింతకొమ్మదిన్నె : లింగారెడ్డిపల్లెలోని మసీదు మీనారుపై మంగళవారం రాత్రి పిడుగు పడటంతో మీనారు పైభాగం విరిగి పక్కనే ఉన్న ముతాల రెడ్డన్న అనే వ్యక్తి నివాసంపై పడింది. సిమెంట్ రేకుల నివాసం కావడంతో మినారు శిథిలం వారి ఇంట్లో పడింది. ఇంట్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

శ్రీమోపూరి భైరవేశ్వరస్వామి ఆలయానికి వైఎస్సార్‌సీపీ హయాంలో మహర్దశ

- రూ.26.22 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి
- టూరిజం కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- ఎల్లో మీడియాకు కనిపించని అభివృద్ధి


భైరవేశ్వరాలయం వద్ద రూ.2.22 కోట్లతో నిర్మించిన టూరిజం భవనం


అత్యాధునిక హంగులతో నిర్మించిన టూరిజం కల్యాణ మండపం


మొగమూరు వాగు వద్ద రూ.16 కోట్లతో నిర్మించిన వంతెన


పులివెందుల - వీరపునాయునిపల్లె రహదారి నుంచి భైరవేశ్వరాలయం వరకు నిర్మించిన డబుల్ లైన్ రోడ్డు

వేముల : జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాలలో వేముల మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీమోపూరి భైరవేశ్వరస్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయాన్ని దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఆలయాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవగానే భైరవేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఇందులో భాగంగానే భైరవేశ్వరాలయం వద్ద రూ.2.22 కోట్లతో టూరిజం కల్యాణ మండపం, గదులు పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారు. ఈ కల్యాణ మండపాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే నల్లచెరువుపల్లె గ్రామం నుంచి భైరవేశ్వరాలయానికి వెళ్లేందుకు రహదారి మార్గం సరిగా లేకపోవడంతోపాటు వర్షాకాలంలో వరద నీటితో మొగమూరు వాగు దాటి వెళ్లాలంటే భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. అంతేకాక రోడ్డు కూడా ఇరుకుగా ఉండటంతో రాకపోకలు తీవ్ర అవస్థలు పడేవారు. ఈ సమస్యలపై గ్రామస్తులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకరావడంతో వెంటనే ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారాలపై దృష్టి సారించారు. బ్రిడ్జి నిర్మాణానికి భూములు, బోర్లు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించి బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయించి అందుబాటులోకి తెచ్చారు. పులివెందుల-వీరపునాయునిపల్లె ప్రధాన రహదారి నుంచి భైరవేశ్వరాలయానికి వెళ్లాలంటే సింగిల్ రోడ్డుతో భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఈ రహదారిని డబుల్ లైన్‌గా మార్చేందుకు రూ.16 కోట్లను ఎండీఆర్ ప్లాన్ కింద మంజూరు చేయించి త్వరితగతిన పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే మొగమూరు వాగు వద్ద వరద నీటి ప్రవాహంతో ఇటువైపు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండటంతో మొగమూరు వాగు వద్ద వంతెన నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులను ఎండీఆర్ ప్లాన్ కింద మంజూరు చేయించి వంతెన పనులు పూర్తి చేయించారు. ఈ పనులు పూర్తి కావడంతో భక్తులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎంత వరదనీరు వచ్చినా మొగమూరు వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణంతో ఆలయానికి వెళ్లేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండాపోయాయి. భైరవేశ్వరాలయం వద్ద పర్యాటక కేంద్రం అభివృద్ధికి నిర్మించతలపెట్టిన మరో భవనానికి పునాదులు వేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడం, నిధులు ఆగిపోవడంతో పనులు నిలిచిపోయాయి. రూ.26 కోట్లతో ఆలయానికి వెళ్లేందుకు టూరిజం భవనంతోపాటు కల్యాణ మండపం పూర్తి చేసిన అభివృద్ధి పనులు ఎల్లో మీడియాకు కనిపించకపోవడం దురదృష్టకరం. వాస్తవాలను వక్రీకరించి రాస్తూ చేసిన అభివృద్ధిని రాయకపోవడం, మిగిలిన పనులను భూతద్దంలో చూపడం ఎల్లోమీడియాకు పరిపాటిగా మారిపోయింది.

ఫ్యాక్షన్ జీవితాలకు స్వస్తి చెప్పండి

ముద్దనూరు : ప్రస్తుత సమాజ పరిస్థితిలననుసరించి ఫ్యాక్షన్ జీవితాలకు స్వస్తి చెప్పి ప్రశాంతా జీవితాన్ని గడపాలని ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐ రియాజ్ అహమ్మద్, స్థానిక సీఐ దస్తగిరిలు తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని కోడిగాండ్లపల్లెలో ఫ్యాక్షన్ , సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలపై పోలీసుశాఖ కళాజాతలో భాగంగా మేలుకొలుపు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యాక్షన్ భూతాన్ని కనుమరుగు చేయాలని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవనం సాగించాలని, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా వుండాలని సీఐలు సూచించారు. కార్యమంలో మహిళా ఎస్ఐ ద్వారక, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గండి అన్నదానానికి వితరణ

చక్రాయపేట : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీగండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రూ.లక్ష విరాళం దాతలనుంచి వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలోని ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులో ఉన్న ఆదం నారాయణరెడ్డి, కళావతిల కుమారుడు హేమకుమార్‌రెడ్డి రూ. 50,116, అలాగే తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం కొత్త కండ్రిగ గ్రామానికి చెందిన కంభం సుధాకర్‌రెడ్డి, సంగీతల కుమారుడు వెంకటసుబ్బారెడ్డి, కుమార్తె నందితరెడ్డిలు రూ.50,116ల నగదును విరాళంగా ఇచ్చారన్నారు. దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశామన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వర్తి కేసరిస్వామి, ఆలయ మాజీ చైర్మన్ వెంకటస్వామిలు పాల్గొన్నారు.



విద్యా నిలయాలుగా వేంపల్లె ప్రసిద్ధి

- ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు
- క్రీడల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలలో ప్రతిభ

వేంపల్లె : విద్యా నిలయాలుగా వేంపల్లె ఎంతో ప్రసిద్ధిగాంచింది. వేంపల్లె మండల కేంద్రంలో అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యా సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తూ వేంపల్లె మండలంలో ప్రవేట్ విద్యా సంస్థలు కార్పొరేట్ సంస్థలకు దీటుగా విద్యను అందిస్తున్నాయి. ప్రతి ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. చుట్టూ ఐదు మండలాల నుంచే కాక ఇతర జిల్లాల నుంచి ఎంతో విద్యార్థులు వేంపల్లెకు వచ్చి హాస్టళ్లలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. అంతేకాకుండా సుదూర ప్రాంతాల నుంచి కూడా పిల్లలు వచ్చి విద్యా సంస్థల ప్రాధాన్యత గుర్తించి హాస్టళ్లలో ఉంటూ చదువును కొనసాగిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా పాఠశాల యాజమాన్యాలు వసతి, విద్యాబోధన విషయమై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఇక్కడ చదివి న విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవలందిస్తున్నారు. అంతేకాకుండా క్రీడల్లో కూడా నైపుణ్యత సాధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ప్రతిభను సాధిస్తున్నారు. గత 35 ఏళ్లుగా ఉషా కిరణ్ హైస్కూల్, శ్రీచైతన్య ఉన్నత పాఠశాల, స్వామి వివేకానంద పాఠశాలలు విద్యను బోధిస్తున్నాయి. ఆ తర్వాత కొన్ని విద్యా సంస్థలను స్థాపించారు. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, రాఘవేంద్ర హైస్కూల్, తేజ హైస్కూల్, నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, శ్లోక ఒలంపియాడ్ స్కూల్, శ్రీనివాస హైస్కూల్, సంసిద్ సతీష్‌రెడ్డి హైస్కూల్ తదితర పాఠశాలలు వెలిశాయి. ప్రతి ఏడాది ఎంతో అభివృద్ధి చెందుతూ పట్టణాలలో ఉన్న విద్యా సంస్థలకు ఏమా త్రం తీసిపోకుండా ఇంగ్లీష్ మీడియంలో వివిధ కోర్సులను ముందుకు తీసుకువచ్చి ఆదర్శంగా నిలుస్తూ విద్యను అభ్యసిస్తున్నాయి.

కరస్పాండెంట్స్ వారి మాటల్లో...

శ్రీచైతన్య ఉన్నత పాఠశాల :
35 ఏళ్లుగా వేంపల్లెలో బి.చక్రపాణిరెడ్డి శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలను స్థాపించి పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యనభ్యసించారు. వారికి ఉత్తమ విద్యనందించి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా విద్యార్థులను తీర్చిదిద్దారు. రిషికేశ్వర్‌రెడ్డి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, భాను ప్రకాశ్‌రెడ్డి డీఎస్పీ, వివిధ ప్రభుత్వ శాఖలలో అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ జూనియర్ ఇంజనీర్లు, అడిషనల్ డైరెక్టర్లు, వివిధ కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలలో వీపీ, ఏవీపీ హోదాలలో, చార్టెటెడ్ అకౌంటెంట్లు, దేశ విదేశాలలో చాలామంది విద్యార్థులు నెలకు లక్షలాది రూపాయల ప్యాకేజీలతో ఉద్యోగాలను సాధించి అత్యున్నతస్థాయిలో కొనసాగుతున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు క్రీడలు, సంగీత నృత్యాలు, కోలాటాలు శిక్షణలు ఇప్పించి విద్యార్థులు మానసిక, శారీరకంగా ఉండేందుకు తోడ్పాటునందిస్తూ విద్యార్థులలోని ప్రతిభా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు దేశ, విదేశాల్లో కొలువులు సాధించారు.

ఉషాకిరణ్ పాఠశాలలో :
గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యనందించాలనే లక్ష్యంతో 1991లో బి.ఎస్. రమణారెడ్డి పాఠశాలను స్థాపించారు. ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ఉన్నత స్థాయిలో ఎదిగారు. పి.దేవనాథరెడ్డి ఎమ్మెస్ ఆర్థోపెడిక్స్ వై.బ్రహ్మ మహేశ్వర్ రెడ్డి ఎమ్మెస్ ఆర్థోపెడిక్స్, ఎయిమ్స్ భోపాల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు జనరల్ హాస్పిటల్ రామిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎండి. రేడియాలజీ మణిపాల్ యూనివర్సిటీ ఆకాష్ హాస్పిటల్స్ పి.శ్రీకాంత్ రెడ్డి, కస్టమ్స్ ఆఫీసర్‌గా పి.శ్రీధర్‌రెడ్డి, కస్టమ్స్ ఆఫీసర్‌గా వై.మునిచంద్రారెడ్డి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.మల్లీశ్వరి, ఆడిటర్ బి.నవీన్‌కుమార్, ఎండీ పీడియాట్రిక్ దాదాపు 20 మంది పూర్వ విద్యార్థులు విదేశాల్లో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్లుగా పని చేస్తున్నారు.


వేంపల్లె పట్టణ వ్యూ

స్వామి వివేకానంద పాఠశాలలో:
సువిశాలమైన వాతావరణంలో స్వామి వివేకానంద పాఠశాలను సీఎస్ రామాంజనేయరెడ్డి ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తూ, సామాన్య కుటుంబాల విద్యార్థులతో అత్యుత్తమైన ఫలితాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల ఏపీపీఎస్సీలో పి.మణికంఠ అనే విద్యార్థి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. అంతేకాకుండా ఎల్.లావణ్య, వి.వెంకటశివారెడ్డి, వై.శివకేశవరెడ్డి, ఎం.లోకేశ్వరి, డి.సుదర్శన్‌రెడ్డి, ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుత నీట్ పరీక్షల్లో సి.బి.ఎలనీశ్వర్‌రెడ్డి 543 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నిలిచారన్నారు. అలాగే క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ పోటీలలో ప్రతిభ చూపుతున్నారు. ఈ పాఠశాలలో క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

వైఎస్సార్ హయాంలో సాంకేతిక విద్యాలయాలు :
దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ఇడుపులపాయలో ట్రిపుల్‌ఐటీ, పాలిటెక్నిక్ కళాశాల, అలాగే తనయుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల తదితర విద్యా సంస్థలను మంజూరు చేయించి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యనందించడమే లక్ష్యంగా విద్యాలయాలను ఏర్పాటు చేశారు.